క్లుప్తంగా

16న విద్యుత్ అదాలత్

చాపాడు : స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద ఈ నెల 16న విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక (విద్యుత్ అదాలత్) కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మైదుకూరు విద్యుత్ శాఖ సబ్ డివిజనల్ అధికారి జె.శ్రీకాంత్ తెలిపారు. గతంలో ఇక్కడ పని చేసిన ఓ విద్యుత్ అధికారి మోసపూరిత చర్యల కారణంగా నష్టపోయిన బాధిత రైతుల సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేకంగా ఉన్నతాధికారులు ఆదేశాల మేరకూ విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. బాధిత రైతులు 16న ఉదయం 8:30గంటల నుంచి మధ్యాహ్నం 1.30గంటల వరకు ఫిర్యాదులు చేయవచ్చని కోరారు.

తల్లికి వందనంపై స్పష్టత ఇవ్వాలి

పోరుమామిళ్ల : తల్లికి వందనం పథకంపై ప్రభుత్వ వైఖరి గందరగోళంగా ఉందని, తల్లి దండ్రులకు ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని ఏఐఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు జగదీష్ కోరారు. విలేకరులతో గురువారం జగదీష్ మాట్లాడుతూ పాఠశాలలు ప్రారంభమైన రోజే 1 వతరగతి నుండి ఇంటర్ వరకూ ప్రతి విద్యార్థికి రూ.15 వేలు ఇస్తామని చెప్పి, రూ.13 వేలే ఇస్తామనడం దారుణమన్నారు. తెల్లరేషన్ కార్డు కలిగిన వారికి ఇంట్లో ఎంతమంది ఉంటే అంతమందికి రూ.15 వేలు చెల్లించాలని జగదీష్ కోరారు. జులై 5న తల్లుల అకౌంట్‌లో జమ చేస్తామని సోషల్ మీడియా వేదికగా జరుగుతున్న ప్రచారానికి తెరదించాలని ఆయన కోరారు.

రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ



రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేస్తున్న ఎస్‌సీఏ సభ్యులు

ప్రొద్దుటూరు క్రైం : స్థానిక జిల్లా ప్రభుత్వాస్పత్రిలో రోగులకు అంబాసిడర్స్ ఆఫ్ క్రైస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. మనలో ఉన్న ప్రేమను చేతల ద్వారా చూపించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు అసోసియేషన్ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌సీఏ ప్రెసిడెంట్ ఎన్.బాబు, సెక్రటరీ పీటీ సామ్యూల్, జాయింట్ సెక్రటరీ స్వరూప్, డైరెక్టర్లు సునీల్, ప్రసాద్, సభ్యులు కాలేబు, డేవిడ్ రాజ్, ఉదయ్ పాల్గొన్నారు.

విమాన ప్రమాదంపై ఎమ్మెల్సీ దిగ్భ్రాంతి

పోరుమామిళ్ల : అహమ్మదాబాద్ సమీపంలో జరిగిన విమాన ప్రమాదంపై ఎమ్మెల్సీ డీసీ.గోవిందరెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. 242 మంది ప్రయాణికులతో ఉన్న ఎ1–171 విమానం కూలిపోయిన సమాచారం తెలిసి ఆయన తల్లడిల్లిపోయారు. ఇంతటి ఘోర విపత్తు ఊహించలేనిదని, తీవ్ర విషాదకరమైన సంఘటన అని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రయాణికుల కుటుంబాలకు, సిబ్బందికి ఆయన ప్రగాఢ సంతాపం తెలిపారు.

మున్సిపల్ కమిషనర్‌గా రవిచంద్రారెడ్డి



ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు మున్సిపల్ కమిషనర్‌గా సి.రవి చంద్రారెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. బాపట్ల డివిజన్‌లో డివిజనల్ అకౌంట్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న ఈయనను డిప్యూటేషన్‌పై కమిషనర్‌గా నియమించారు. ఇక్కడ పనిచేస్తున్న కమిషనర్ మల్లికార్జునను హిందూపురం మున్సిపాలిటీకి బదిలీ చేశారు.

అట్లూరు ఎంపీడీఓగా వెంగమునిరెడ్డి

అట్లూరు : అట్లూరు మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా టి.వెంగమునిరెడ్డి గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకూ ఎంపీడీవో కార్యాలయంలో అడ్మిన్‌స్ట్రేషన్ అధికారిగా విధులు నిర్వహిస్తున్న భాస్కర్‌బాబు (ఎఫ్‌ఏసీ)ఎంపీడీఓగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. రెగ్యులర్ ఎంపీడీఓ లేకపోవడంతో తాజాగా బి.మఠం ఎంపీడీఓ వెంగమునిరెడ్డిని అట్లూరు ఎంపీడీఓగా బదిలీ చేశారు. గురువారం ఆయన బాధ్యతలు చేపట్టారు.

విద్యార్థుల జీవితాలతో చెలగాటం వద్దు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : వైఎస్‌ఆర్ అండ్ ఆర్కిటెక్ యూనివర్సిటీ విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడవద్దని ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వలరాజు అన్నారు. నగరంలోని వైఎస్‌ఆర్ మెమోరియల్ ప్రెస్ క్లబ్‌లో విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఆర్కిటెక్ యూనివర్సిటీలో 13 డిపార్ట్‌మెంట్లలో 500 మంది విద్యార్థులు ఉన్నారన్నారు. 2020–21, 2021–22 విద్యా సంవత్సరానికి సీఓఏ కౌన్సిల్ అఫ్ ఆర్కిటెక్ పర్మిషన్ ఇవ్వాల్సి ఉందన్నారు. పది రోజుల్లో విద్యా సంవత్సరం పూర్తవుతున్నా.. ఇంకా పర్మిషన్ లేకపోవడం దారుణమన్నారు. విద్యార్థులు ఆందోళన చెందుతుంటే.. ఉన్నతాధికారులు కాలయాపన చేయడం తగదన్నారు. విద్యార్థులు ప్రాక్టికల్ వర్క్, పరీక్షలకు ఎలా వెళ్తారని ప్రశ్నించారు. అరుణ్ కుమార్, సాయి కృష్ణ పాల్గొన్నారు.

నాడు ఆసన్నహస్తం.. నేడు నిలువునా మోసం

- అమలుకు నోచుకుని ఆడ బిడ్డ పథకం
- ప్రతి నెలా రూ.1500 ఇస్తామని మోసం



కాపునేస్తం చెక్కును అందిస్తున్న సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి (ఫైల్)

కాశినాయన : అమలుచేయలేని హామీలు గుప్పించి అధికారం చేపట్టిన తర్వాత కూటమి ప్రభుత్వం ప్రజలకు మొండిచేయి చూపించింది. మహాశక్తి పథకం కింద ఆడబిడ్డ పేరిట 18 ఏళ్ల నిండిన ప్రతి మహిళకు ప్రతినెలా రూ.1500 అందిస్తామన్న బూటకపు మాటలకు మహిళలు కూటమి నాయకులకు ఓట్లు కుమ్మరించారు. సీఎంగా బాధ్యతలు చేపట్టి ఏడాదయినా ఇప్పటివరకూ ఆ పథకం ఊసే లేదు. ఇటీవల కడపలో నిర్వహించిన మహానాడు సందర్భంగా అయినా ఆడ బిడ్డ నిధిపై ప్రకటన చేస్తారని అక్క చెల్లెమ్మలు ఎదురుచూసినా ఎలాంటి స్పష్టమైన హామీ ఇవ్వకుండా నిరాశ మిగిల్చారు.

బద్వేలు నియోజకవర్గంలో దాదాపు 3 లక్షలకు పైగా జనాభా ఉంది. అందులో దాదాపు 50 శాతం మేరకు మహిళలు ఉన్నారు. 18 ఏళ్లకు పైబడి 59 ఏళ్ల లోపు మహిళలు 30 శాతం మంది ఉన్నారు. ఆడ బిడ్డ నిధి ద్వారా ప్రతి కుటుంబంలోని మహిళకు చంద్రబాబు నెలకు రూ.1500 చొప్పున ఏడాదికి రూ.18వేలు ఇస్తామని హామీ ఇచ్చారు. ఉచిత బస్సు, సున్నా వడ్డీ రుణాల పెంపు తదితర హామీలు గుప్పించడంతో మహిళలు ఎంతో ఆశపడ్డారు. ఇదిగో ఇస్తాం.. అదిగో ఇస్తాం అని కాలయాపన చేస్తుండటంతో బాబును నమ్మిన మహిళలు మోసపోయామని మదనపడుతున్నారు. 2014 ఎన్నికలప్పుడు డ్వాక్రా రుణాల మాఫీ పేరుతో మోసం చేసిన టీడీపీ నాయకులు ఇపుడు రూ.1500 ఇస్తామని చెప్పి మళ్లీ టోపీ పెట్టారని మహిళలు మండిపడుతున్నారు.

గత ప్రభుత్వంలో మహిళలే మహారాణులు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జగనన్న అమలు చేసిన సంక్షేమ పథకాల ద్వారా బద్వేల్ నియోజకవర్గంలోని మహిళలు ఎంతో లబ్ధి పొందారు. నవరత్నాల పథకాలు ప్రతి కుటుంబానికి అందాయి. స్వయం సహాయక సంఘాలకు కోట్ల రూపాయల వడ్డీ రాయితీ ఇచ్చారు. పేద కాపు సామాజిక వర్గాలకు చెందిన మహిళలకు ఏడాదికి రూ.15వేల చొప్పున నాలుగేళ్లకు రూ.60వేల లబ్ధి చేకూరింది. ఈబీసీ నేస్తం ద్వారా పేద మహిళలకు ఏడాదికి రూ.15 వేలు అందించారు. పేద వర్గాలకు చెందిన 45 ఏళ్లు నిండిన మహిళలకు ఏడాదికి రూ.18,500 అందజేశారు. ఇలా చెప్పుకుంటూ పోతే వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అమలు చేసిన పథకాలు కోకొల్లలు. ఇప్పటికైనా ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చాలని మహిళలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

అధిక దిగుబడినిచ్చే వంగడాలను గుర్తించాలి



మాట్లాడుతున్న శాస్త్రవేత్త డాక్టర్ బాలకృష్ణ

మైదుకూరు : వరి, మినుము, శనగ తదితర పంటల్లో అధిక దిగుబడినిచ్చే వంగడాలను రైతులు గుర్తించాలనిశాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న వికసిత కృషి సంకల్ప అభియాన్‌లో భాగంగా గురువారం జమ్మలమడుగు మండలంలో కార్యక్రమాలు నిర్వహించారు. మైదుకూరు మండలం వనిపెంట కృషి విజ్ఞాన కేంద్రం అధిపతి, శాస్త్రవేత్త డాక్టర్ ఎం.బాలకృష్ణ అధ్యక్షతన దేవగుడి, ధర్మాపురం, సున్నపురాళ్లపల్లె, పెద్దదండ్లూరు, సుగుమంచిపల్లె, సలివెందుల, చౌడూరు గ్రామాల్లో ఈ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు అధిక దిగుబడినిచ్చే వంగడాలపై రైతులతో చర్చించారు. అధిక దిగుబడినిచ్చే వంగడాలను రైతులకు సూచించారు. శాస్త్రవేత్త డాక్టర్ బాలకృష్ణ మాట్లాడుతూ మట్టి పరీక్షలకు అనుగుణంగా పంటల సాగు చేపట్టాలని సూచించారు. ప్రొద్దుటూరు పశువైద్య కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ విజయకుమార్ మాట్లాడుతూ పశువుల్లో కృత్రిమ గర్భధారణ, వ్యాధి నిరోధక టీకాల గురించి వివరించారు. కేవీకే ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ ఫిరోజ్ హుస్సేన్ ఉద్యాన పంటల్లో సస్యరక్షణ, తెగుళ్ల నివారణ, సమగ్ర యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు.

స్మార్ట్ మీటర్ల ఏర్పాటును వ్యతిరేకించాలి



గోడపత్రాలను ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

అట్లూరు : విద్యుత్తు స్మార్ట్ మీటర్ల ఏర్పాటును వ్యతిరేకించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు చాంద్ బాషా, మండల కార్యదర్శి రమణయ్య పేర్కొన్నారు. అట్లూరు క్రాస్ రోడ్డులోని సీపీఎం కార్యాలయంలో గోడపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం చంద్రబాబునాయుడు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు స్మార్ట్ మీటర్ల ఏర్పాటును వ్యతిరేకించాలని చెప్పి.. ఇపుడు వినియోగ దారులపై భారం మోపుతున్నారని అన్నారు. విద్యుత్తు చార్జీలు పెంచడంతోపాటు ప్రజలపై అదనపు భారం మోపి నడ్డి విరుస్తున్నారన్నారు. ప్రమాదకరమైన మీటర్లను అమర్చితే ధ్వంసం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు దుర్గమ్మ, స్వప్న, సుబ్బమ్మ, రవీంద్ర, గోపయ్య, ఓబయ్య, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల విలీనం వద్దే వద్దు



కల్లూరులో నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

ప్రొద్దుటూరు కల్చరల్ : పాఠశాలలను విలీనం చేయవద్దని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనకు దిగారు. విద్యార్థులను గత పాఠశాలలోనే కొనసాగించాలని, మోడల్ స్కూల్‌లో విలీనం చేయవద్దని కల్లూరు హరిజనవాడలో, లింగారెడ్డి నగర్‌లలో ఉన్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులు, తల్లిదండ్రులు నిరసన వ్యక్తం చేశారు. గురువారం పాఠశాలలు ప్రారంభం కాగానే తల్లిదండ్రులు పాఠశాలల వద్దకు వచ్చి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా 3, 4, 5 తరగతుల విద్యార్థులను మోడల్ పాఠశాలలో విలీనం చేయవద్దని గత పాఠశాలలోనే కొనసాగించాలని కోరారు. తమ పిల్లలను మోడల్ స్కూల్‌లో విలీనం చేస్తే పాఠశాలకు పంపకుండా ఇంటి వద్దే ఉంచుకుంటామని స్పష్టం చేశారు.

మధ్యాహ్న భోజనం పరిశీలించిన అధికారులు



మధ్యాహ్న భోజనాన్ని రుచి చూస్తున్న అధికారులు

చాపాడు : స్థానిక జీఏఎస్ జిల్లా పరిషత్ పాఠశాలలో గురువారం మండల అభివృద్ధి అధికారి వీర కిషోర్, ఎంఈఓలు రవిశంకర్, వంశీకృష్ణ డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ విద్యా సంవత్సరం నుంచి సన్న బియ్యంతో మధ్యాహ్నం భోజనం పెట్టాలని ప్రభుత్వం నిర్ణయించడంతో భోజనాన్ని పరిశీలించినట్లు ఎంపీడీఓ తెలిపారు. మధ్యాహ్న భోజనంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని నాణ్యత లేకపోతే చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు. అనంతరం అధికారులు పాఠశాలల వద్దనే మధ్యాహ్న భోజనాన్ని రుచి చూశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు వెంకటలక్ష్మి, ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



సైకిల్ ర్యాలీలో విద్యార్థులు, వైద్య సిబ్బంది

అట్లూరు : యోగా చేయడం ద్వారా అందరూ సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని తొట్టిగారిపల్లె పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ జె.వినయ్‌కుమార్ అన్నారు. యోగాంధ్ర ప్రచారంలో భాగంగా బద్వేల్ పట్టణంలోని కోటవీధి బాలికోన్నత పాఠశాలలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రతి రోజు కనీసం గంటపాటు వాకింగ్, సూర్య నమస్కారాలు, సైకిల్ తొక్కడం వంటి వ్యాయామాలతో బీపీ, షుగర్, గుండె సంబంధిత, కిడ్నీ సంబంధిత వ్యాధులను దూరం చేయవచ్చని తెలిపారు. అనంతరం విద్యార్థినులతో కలిసి సైకిల్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వెంకటరామిరెడ్డి, వెంగయ్య, ఏఎన్‌ఎం చెన్నమ్మ, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

రైతు సేవా కేంద్రాల మూత

గోపవరం : మండలంలోని రాచాయపేట, టి.సండ్రపల్లె, బ్రాహ్మణపల్లెలో సిబ్బంది లేక రైతు సేవా కేంద్రాలు మూతపడ్డాయి. ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతుండడంతో వివిధ పంటలు సాగు చేసే రైతులంతా రాయితీ విత్తనం, ఎరువుల కోసం రైతు సేవా కేంద్రాల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 50 శాతం రాయితీతో జీలుగలు, జనుములు రైతులకు పంపిణీ చేసింది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదవుతున్నా సబ్సిడీ ద్వారా రైతులకు ఇచ్చే విత్తనాల విషయంలో ఎలాంటి చర్యలు తీసుకోలేదు. జీలుగలు, జనుము పంపిణీ చేపట్టలేదు. ఎరువులు కూడా అందుబాటులో లేకపోవడంతో రైతు సేవాకేంద్రాలకు పని లేకుండాపోయింది. ఇదిలా ఉంటే ఈ నెల 20న అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రైతుల ఖాతాలో నగదు జమచేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. రైతులు ఈకేవైసీ చేయించి సొమ్ము కేంద్రాల వద్దకు వచ్చి వెనుదిరుగుతున్నారు. మూతపడిన రైతు సేవా కేంద్రాలు తెరిపించి మెరుగైన సేవలందించాలని రైతులు కోరుతున్నారు.

బాల కార్మికుల వ్యతిరేక దినోత్సవం

కడప అర్బన్: బాల కార్మికుల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరి, జడ్జి ఎస్.బాబా ఫక్రుద్దీన్ ఆధ్వర్యాన కడప న్యాయ సేవా సదన్‌లో గురువారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ 14–18 సంవత్సరాల మధ్య వయస్సున్న పిల్లలను పనిలో పెట్టుకుంటే జైలు శిక్ష, జరిమానా ఉంటాయన్నారు. అనంతరం బాలల చట్టాలు ఉపయోగాలపై ఆయన అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ వెంకటేశ్వర్లు, అధికారులు పాల్గొన్నారు.

కేసుల విచారణ చేపట్టిన డీఎస్పీ

ముద్దనూరు : మండలంలోని దేనేపల్లె గ్రామంలో రెండు రోజుల క్రితం జరిగిన ఘర్షణ విషయంలో జరిగిన పరస్పర కేసుల విచారణను డీఎస్పీ వెంకటేశ్వరరావు చేపట్టారు. గురువారం ఆయన స్థానిక సీఐ దస్తగిరి, ఎస్ఐ మైనుద్దీన్‌లతో కలసి దేనేపల్లెలోని సంఘటనా స్థలాలకు వెళ్లి విచారించారు. రామ్మోహన్ అనే వ్యక్తిపై గొడ్డలితో దాడితో పాటు, అదే గ్రామానికి చెందిన వివాహిత మహిళ పట్ల అసభ్యకరంగా ప్రవర్తించడంపై కేసు నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో డీఎస్పీ సాక్షులను విచారించి వివరాలు సేకరించారు. రెండు కేసులపై దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

జమ్మలమడుగు : పాఠశాలలు పునఃప్రారంభం కావడంతో మొదటి రోజున వచ్చిన విద్యార్థులకు పుస్తకాలను మండల విద్యాశాఖాధికారులు, ప్రధానోపాధ్యాయులు పంపిణీ చేశారు. మొదటి రోజు కావడంతో ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలల్లో చాలా తక్కువ మంది హాజరయ్యారు. గురువారం మంచి రోజు అంటూ మరికొంత మంది తమపిల్లలకు ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు చేయించారు. ఎర్రగుంట్ల మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సర్వేపల్లి రాధకృష్ణన్ విద్యామిత్ర కిట్స్‌ను ఎంఈఓ శివప్రసాద్ పంపిణీ చేశారు.

పౌర విమానశాఖ మంత్రి రాజీనామా చేయాలి

జమ్మలమడుగు : గుజరాత్‌లోని అహమ్మదాబాద్‌లో ఇండియన్ ఏయిర్‌లైన్స్ విమాన ప్రమాదంలో 241 మంది మరణించారని ఈ ప్రమాదానికి నైతిక బాధ్యతగా పౌర విమానశాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు తన పదవికి రాజీనామా చేయాలని మున్సిపల్ విభాగ జిల్లా అధ్యక్షుడు హృషికేశవరెడ్డి డిమాండ్ చేశారు. గురువారం ఆయన స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. కేంద్రంలో మంత్రి పదవులు చేసిన వారు తమ శాఖకు సంబంధించిన చిన్న పొరపాట్లు దొర్లిన నైతికబాధ్యతగా రాజీనామాలు చేశారు. అందులో భాగంగానే 1950లో రైలు ప్రమాదం జరిగితే అప్పటిరైల్వే మంత్రిగా పనిచేసిన లాల్ బహదూర్‌శాస్త్రి నైతిక బాధ్యత వహిస్తూ తమ పదవికి రాజీనామా చేశారన్నారు. అనంతరం విమాన ప్రమాదంలో మరణించిన వారికి నివాళులు అర్పించారు.

విశాఖ స్టీల్ ప్లాంటు ప్రైవేటీకరణ ఆపాలి

కడప సెవెన్‌రోడ్స్ : విశాఖ స్టీల్ ప్లాంటు ప్రైవేటీకరణ ఆపాలని ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాగసుబ్బారెడ్డి, జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్, ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు సుభాషిణి డిమాండ్ చేశారు. కలెక్టరేట్ ఎదుట గురువారం నిర్వహించిన ధర్నాలో వారు మాట్లాడుతూ ప్రైవేటీకరణ ఆపాలంటూ మూడేళ్లుగా కార్మిక సంఘాలు ఆందోళనను కొనసాగిస్తున్నా ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం విచారకరమన్నారు. సుమారు 3200 మంది కాంట్రాక్టు కార్మికులను అకారణంగా తొలగించారని విమర్శించారు. ఎస్‌ఆర్ పాలసీ, కార్మికులకు రావాల్సిన ఇతర బెనిఫిట్స్ ఇవ్వకపోవడం అన్యాయమన్నారు. విశాఖ స్టీల్ ప్లాంటు ప్రైవేటీకరణ అడ్డుకుంటామని ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మాట్లాడిన టీడీపీ, జనసేన నాయకులు ఇప్పుడెందుకు నోరుమెదపడం లేదని ప్రశ్నించారు. కడపలో ఉక్కు పరిశ్రమను ప్రారంభించాలని డిమాండ్ చేశారు.

క్షయ వ్యాధిని నిర్లక్ష్యం చేయొద్దు



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న వైద్యాధికారులు

ప్రొద్దుటూరు క్రైం : క్షయ వ్యాధిని నిర్లక్ష్యం చేయొద్దని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ శివప్రసాద్ రెడ్డి తెలిపారు. జాతీయ క్షయ వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా టీబీ విముక్తి భారత్ అభియాన్ – ఇంటెన్సిఫైడ్ టీబీ కాంపెయిన్‌ను గురువారం పట్టణంలోని అర్బన్ హెల్త్ సెంటర్లలో ప్రారంభించారు. డిప్యూటీ డీఎంహెచ్ఓ మాట్లాడుతూ క్షయ వ్యాధి నిర్మూలనకు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. క్షేత్ర స్థాయిలో ఏఎన్‌ఎం, ఆశాల ద్వారా ధూమపానం, మద్యపానం, షుగర్, పోషకాహార లోపం, హెచ్ఐవీ, కిడ్నీ, క్యాన్సర్ తదితర దీర్ఘకాలిక వ్యాధులకు మందులు వాడిన వారు, వారి కుటుంబ సభ్యులకు, క్షయవ్యాధి లక్షణాలు ఉన్న వారికి గళ్ల పరీక్షలు చేస్తున్నట్లు తెలిపారు. టీబీ ఉందని నిర్ధారణ అయితే వారికి ఆరు నెలలు ఉచిత మందులు పంపిణీ చేస్తామన్నారు. జ్వరం, రెండు వారాలు మించి దగ్గు ఉండటం, ఛాతిలో నొప్పి, బరువు తగ్గడం, ఆకలి మందగించడం, అలసట, ఆయాసం , గళ్లలో రక్తం పడటం లక్షణాలు టీబీ లక్షణాలు అని తెలిపారు. అనంతరం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, కోఆర్డినేటర్ శంకర్, సీఓ నాగజ్యోతి, టీబీ హెల్త్ అసిస్టెంట్స్ గురుప్రసాద్, సిద్ధారెడ్డి, సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

తైక్వాండో పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



విజేత క్రీడాకారులతో శిక్షకులు

పోరుమామిళ్ల : అనంతపురం జిల్లా తాడిపత్రిలో ఈ నెల 10, 11, 12వ తేదీల్లో జరిగిన తైక్వాండో రాష్ట్ర స్థాయి పోటీల్లో పోరుమామిళ్ల విద్యార్థులు ప్రతిభ చూపారని మాస్టర్ నాయబ్ రసూల్ తెలిపారు. విలేకరులతో నాయబ్ మాట్లాడుతూ బంగారు పతకాలు సాధించిన నదీష్, తారక్, ఆఫ్రిన్, మాధవిలత, తస్లీమాలు ఈ నెల 23, 24, 25వ తేదీల్లో ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని హరిద్వార్‌లో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. హుస్సేన్, అబూబకర్, హఫీష్, నయీమ్, సాజిత్, ఫర్మాన్, తస్మికలు రజత పతకాలు, అజీజ్, శ్రీనిజ్,ఫయుం, లోక్షితలు కాంస్య పతకాలు సాధించారన్నారు. ఈ పోటీలకు రెఫరీలుగా పోరుమామిళ్లకు చెందిన రోషన్, నయామ్ వ్యవహరించారని, సీనియర్ క్రీడాకారులు నరసింహ ప్రసాద్, ఉస్మాన్, సుభాష్, ఆంజనేయులు, బాలు పాల్గొన్నారన్నారు.

పూజ స్కూల్‌ను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలి



తహసీల్దార్ గంగయ్యకు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

ప్రొద్దుటూరు : మండలంలోని పూజ స్కూల్‌ను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని గురువారం తహసీల్దార్ గంగయ్యకు ప్రజా, విద్యార్థి సంఘాల నాయకులు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా రాయలసీమ పరిరక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ములపాకు ప్రతాప్‌రెడ్డి, రాయలసీమ స్టూడెంట్ ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జగన్, మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ (బ్రహ్మయ్య మాదిగ వర్గం) జిల్లా అధ్యక్షుడు రంగనాయకులు మాట్లాడుతూ చౌడూరు గ్రామంలో ఉన్నతాశయంతో రాజారెడ్డి పూజ స్కూల్‌ను స్థాపించారన్నారు. రాజారెడ్డి హత్య తర్వాత పూజ స్కూల్ నిర్వహణ చిన్నాభిన్నమైందన్నారు. కలెక్టర్ పూజ స్కూల్ నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో విల్సన్, రవి, శ్రీకాంత్, ప్రవీణ్, మస్తాన్, ఏసుదాస్, అక్కయ్య, లక్ష్మయ్య పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆటపాటలతో విద్య



చిన్నారులకు పలక, బలపం అందజేస్తున్న సిబ్బంది

అట్లూరు : అంగన్వాడీ కేంద్రాలలో ఆటపాటలతో కూడిన విద్య అందించడం జరుగుతుందని ఐసీడీఎస్ బద్వేల్ అర్బన్ సూపర్ వైజర్ సుబ్బలక్ష్మి పేర్కొన్నారు. పట్టణంలోని కుమ్మరికొట్టాల అంగన్వాడీ కేంద్రంలో అంగన్వాడీ పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా పిల్లలకు దాతల సహకారంతో పలకలు, బలపాలు అందించి అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాలలో పోషకాహారాలతో పాటు ఆటపాటలతో కూడిన విద్యనందించడం జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్త ప్రభావతి, సహాయకురాలు వెంకట లక్షుమ్మ, చిన్నారులు, తల్లులు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థికి ‘తల్లికి వందనం’ అమలు చేయాలి

ప్రొద్దుటూరు కల్చరల్ : ప్రభుత్వం ఆంక్షలు లేకుండా ప్రతి విద్యార్థికి తల్లికి వందనం పథకాన్ని అమలు చేయాలని పీఎస్‌వైఎఫ్ రాష్ట్ర కన్వీనర్ ఓబులేసు, టీఆర్‌ఎస్‌ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జయరాజు, ఎన్‌డీఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రమేష్ తెలిపారు. గురువారం వారు మాట్లాడుతూ ఈనెల 12 నుండి తల్లికి వందనం పథకం కింద తల్లి ఖాతాల్లో రూ.15వేలు వేస్తామని చెప్పి ఇప్పుడు రూ.13వేలు ప్రతి విద్యార్థికి చెల్లిస్తామని ప్రకటించడం దారుణమన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రతి ఇంటిలో ఒకటో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు ఎంత మంది చదువుతున్నా అందరికి రూ.15వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆంక్షలను తొలగించి వైట్ రేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్క కుటుంబానికి తల్లికి వందనం పథకాన్ని వర్తింపజేయాలన్నారు. జూలై 5వ తేదీన తల్లుల ఖాతాల్లో అమౌంట్ క్రెడిట్ చేస్తారని సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారానికి తెరదించాలని ప్రభుత్వాన్ని కోరారు.

విద్యార్థులకు గుణాత్మక విద్య అందించాలి



ఉపాధ్యాయులతో ఏఎంఓ విజయభాస్కర్

పోరుమామిళ్ల : విద్యార్థులకు గుణాత్మక విద్య అందించి పాఠశాలలను బలోపేతం చేయాలని సర్వశిక్షా అభియాన్ ఏఎంఓ విజయభాస్కర్ పేర్కొన్నారు. పోరుమామిళ్ల మెయిన్‌స్కూల్‌గా పేరుపొందిన ఎంపీపీ పాఠశాలను ఈ ఏడాది మోడల్ ప్రైమరీ పాఠశాలగా అప్‌గ్రేడ్ చేసినట్లు విజయభాస్కర్ తెలిపారు. ఈ సందర్భంగా మొదటి రోజే పాఠశాల సందర్శనకు వచ్చానన్నారు. ఈ కార్యక్రమంలో హెడ్మాస్టర్ సుబ్బారావు, అబ్దుల్‌సత్తార్, కళావతి, జనార్ధన్‌శెట్టి, ఫణిరావు పాల్గొన్నారు.

అనాథాశ్రమానికి విద్యుత్ ఉద్యోగుల వితరణ



వివేకానంద సేవా ఆశ్రమానికి వస్తువులను వితరణ చేస్తున్న ఎస్ఈ రమణ, ఉద్యోగులు

కాశినాయన : అనాథలకు, నిరాశ్రయులకు సేవలు అందిస్తున్న ఆశ్రమాలకు కడప విద్యుత్ ఉద్యోగుల సామాజిక సేవా సంఘం తరఫున అండగా నిలుస్తామని విద్యుత్ శాఖ ఎస్ఈ ఎస్.రమణ పేర్కొన్నారు. గురువారం మండలంలోని ఓబుళాపురం గ్రామ సమీపంలో సగిలేరు నది ఒడ్డున ఉన్న వివేకానంద సేవా ఆశ్రమాన్ని ఆయన, విద్యుత్ ఉద్యోగులు సందర్శించారు. విద్యుత్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో రూ.53వేలు విలువ చేసే ఫ్యాన్లు, ఇన్వర్టర్, లైట్లు, ముళ్లకంచె తదితర వాటిని వితరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనాథలను అక్కున చేర్చుకుని ఆహ్లాదకరమైన వాతావరణంలో వారిని కన్నబిడ్డల్లా చూసుకుంటున్న ఆశ్రమ నిర్వాహకుడు రామకృష్ణారెడ్డిని అభినందించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ అధికారులు ఈఈ నాగరాజు, డీఈఈలు నరసింహా, బ్రహ్మానందరెడ్డి, ఏఈ రవిచంద్ర, వివిధ మండలాల ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

సత్యదేవుడికి భక్తిశ్రద్ధలతో పూజలు



కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్న వేదపండితులు

కడప కల్చరల్: కడప గడ్డిబజారులోని లక్ష్మీసత్యనారాయణస్వామి ఆలయంలో స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవం గురువారం వైభవంగా నిర్వహించారు. వేదిక్ యూనివర్శిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ కల్యాణపురం వరదరాజన్, అర్చకులు విజయ్‌భట్టర్ బృందం ఆధ్వర్యంలో ముందుగా మహా సంకల్పం, విశ్వక్సేన ఆరాధన, లక్ష్మీ తులసీ అర్చన, సామూహిక విష్ణు సహస్రనామం, లక్ష్మి సత్యనారాయణస్వామి సుదర్శన హోమం జరిపారు. మధ్యాహ్నం 12.00 గంటలకు భక్తులకు అన్నప్రసాద వితరణ నిర్వహించారు. సాయంత్రం 5.30 గంటలకు ఆలయ ప్రాంగణంలో స్వామి, అమ్మవార్లను కల్యాణ మూర్తులుగా తీర్చిదిద్ది కల్యాణోత్సవం నిర్వహించారు. భక్తులందరూ సంప్రదాయ వస్త్రాలతో హాజరుకావడం విశేషం. అనంతరం నగరోత్సవం నిర్వహించారు.